www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 25 మే 2025
5
ఏలూరు

కోర్టుకు మాజీ ఎంఎల్‌ఎ వంశీ హాజరు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు కోర్టుకు గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీని పోలీసులు శనివారం హాజరు పరిచారు. హనుమాన్ జంక్షన్ పోలీసు కస్టడీ ముగిసిన వెంటనే వంశీని కోర్టుకు హాజరు పరచాలని నూజివీడు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రావణి గతంలోనే ఆదేశించారు. జడ్జి ఆదేశాల మేరకు నూజివీడు కోర్టుకు హాజరు పరిచారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడటం, 105 కిలోల నుంచి 85 కిలోలకు వంశీ తగ్గడంతో మెరుగైన వైద్య సేవలకు ప్రయివేట్ ఆసుపత్రికి లేదా ఎయిమ్స్‌కు అనుమతినివ్వాలని వంశీ తరఫు న్యాయవాదులు జడ్జిని కోరారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వైద్య సేవలందిస్తారని మెజిస్ట్రేట్ సూచించారు. వంశీ బెయిలు పిటిషన్ ఈ నెల 26కు వాయిదా పడింది. 29వ తేదీ వరకు రిమాండ్ యథావిధిగా కొనసాగుతుంది. నూజివీడు కోర్టు నుంచి వంశీని విజయవాడ సబ్ జైలుకు తరలించారు.

ఉచితానికి వసూళ్లు..!

- ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఫిర్యాదుల వెల్లువ
- ఐవిఆర్ఎస్ కాల్స్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితుల ఆవేదన
- ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అదే తంతు
- ఏలూరు సమీపంలోని అతిపెద్ద ప్రయివేటు ఆసుపత్రిపై 42 ఫిర్యాదులు
- ఏలూరు సర్వజన ఆసుపత్రిపై 35 ఫిర్యాదులు, మొత్తం 30 ఆసుపత్రులపై ఫిర్యాదులు
- 'పశ్చిమ'లోనూ రోజుకు మూడు నుంచి ఐదు వరకూ ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రోగుల పట్ల కనికరం లేదు.. అయ్యో పాపం అనే జాలి లేదు. ఉచితంగా అందించాల్సిన వైద్యానికి సైతం పైసలు వసూలు చేస్తూ పేద రోగుల పట్ల ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) నెట్‌వర్క్ ఆసుపత్రులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా తయారైంది. ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆడిట్ అధికారులు నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ సర్వేలో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు పెద్దసంఖ్యలో ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి ఉంది. వీటిలో ప్రయివేటు ఆసుపత్రులతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులు ఉండటం గమనార్హం. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఏలూరు సమీపంలో అతి పెద్దదిగా పేరొందిన ఆసుపత్రిపై ఏకంగా గడిచిన 23 రోజుల్లో 42 ఫిర్యాదులు వచ్చాయి. ఏలూరు నడిబొడ్డున ఆసుపత్రిపై ఐదు ఫిర్యాదులు నమోదయ్యాయి. మిగిలిన ప్రయివేటు ఆసుపత్రులపైనా ఒకటి నుంచి 13 వరకూ ఐవిఆర్ఎస్ కాల్స్‌లో బాధితులు ఫిర్యాదు చేసిన పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో మొత్తం 30 ఆసుపత్రులపై 165 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రితోపాటు పలు ప్రభుత్వ ఆసుపత్రులపైనా బాధితులు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులపై రోజుకు మూడు నుంచి ఐదు ఫిర్యాదులు వరకూ వస్తున్నాయి. అంటే ఆ జిల్లాలోనూ నెలకు దాదాపు వందకుపైగా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది. రోగులు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతుండగా వైద్య సేవల్లో ఇబ్బంది



పెడతారేమో భయంతో ఎన్నిసార్లు అడిగినా ఆరోగ్యమిత్రలు వద్ద అంతా బాగానే ఉందని బంధువులు, కుటుంబీకులు చెబుతున్న పరిస్థితి కన్పిస్తోంది. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్‌లో మాత్రం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆసుపత్రుల్లో తాము పడుతున్న బాధలు చెప్పుకొని రోగులు ఘొల్లుమంటున్నారు.

ఉచితంలోనూ ఇలా దోచేస్తారు..

గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీగా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్యసేవగా కొనసాగుతున్న పథకంలో దాదాపు మూడు వేలకుపైగా రోగాలకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నెలకు రూ.నాలుగు కోట్లు వరకూ ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 33 ప్రయివేటు, 11 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందుతున్నాయి. పశ్చిమలో 30 ప్రయివేటు ఆసుపత్రులు, ఎనిమిది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో చికిత్స చేయించుకునే రోగి నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయడానికి వీలులేదు. కానీ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో రోగులు చేరుతున్నప్పటికీ డబ్బుల వసూళ్ల మాత్రం కొనసాగుతూనే ఉంది. రోగులు చేరిన వెంటనే ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఇచ్చే సొమ్ము సరిపోదు.. అదనంగా ఖర్చవుతోందని, ఇవ్వగలిగితే వైద్యం అందిస్తాం.. లేదంటే వేరే ఆసుపత్రికి వెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. ఆర్థోపెడిక్, న్యూరో, కిడ్నీ వంటి అనేక అత్యవసర కేసుల్లో ఆసుపత్రి యాజమాన్యాలు ఈ విధంగా బెదిరించి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఆర్థోపెడిక్ రోగులకు నాణ్యమైన రాడ్లు వేస్తామని డబ్బులు వసూలు చేయడం జరుగుతోంది. అంతేకాకుండా రోగి ఆసుపత్రిలో చేరగానే పరీక్షలు, అత్యవసర వైద్యం పేరుతో కనీసంగా రూ. 30 వేల నుంచి రూ.50 వేల వరకూ పిండేస్తున్నారు. తర్వాత ఎన్‌టిఆర్ వైద్యసేవలో నమోదు చేసి మరో రకంగా డబ్బు గుంజుతున్నారు. రోగి ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ సమయంలో బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రుల యాజమాన్యాల బెదిరింపులకు తల్లొగ్గాల్సిన పరిస్థితి ఉంటోంది. దీంతో ప్రభుత్వం అందించే ఉచిత వైద్యంపై జనానికి నమ్మకం లేని పరిస్థితి ఉంటోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోని దుస్థితి నెలకొంది.

ఫిర్యాదులొచ్చిన ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీచేశాం

ఐ.రాజేష్, ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్, ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఐవిఆర్ఎస్ కాల్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై ఆయా ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఆసుపత్రుల నుంచి వివరణలు వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ముదినేపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము మొదలైన వర్షం ఉదయం ఏడు గంటల వరకు కురుస్తూనే ఉంది. అలాగే సాయంత్రం కూడా భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షంతో పలు గ్రామాల్లో వీధులు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. భారీగా కురిసిన వర్షంతో ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై గోతులు ఉండటంతో వర్షపు నీరు నిలిచి చెరువును తలపించాయి. ముదినేపల్లి సెంటర్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక రోడ్లపై నిల్వ ఉంటుంది. ప్రధానంగా ముదినేపల్లి సెంటర్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు,

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోడ్డు గుంతలమయమై అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షంతో పల్లపు ప్రాంతాల్లోని కాలనీల్లో నీళ్లు చేరి కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. అంబేద్కర్ కాలనీ, అన్నవరం జగనన్న కాలనీ, పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర సౌకర్యానికి గురయ్యారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలు సాధించాలి

అవినీతి ఆరోపణలు వస్తే విధుల నుండి తొలగింపే

హౌసింగ్ ఇంజినీర్లతో టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గృహ నిర్మాణాల బిల్లులు మంజూరులో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పని చేయాలని, ఎక్కడైనా అవినీతి ఆరోపణలు వస్తే సదరు ఉద్యోగులను విధుల నుండి తొలగించేందుకు వెనుకాడబోమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం గృహనిర్మాణ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటిస్‌తో గృహనిర్మాణ ప్రగతిపై మండలాలవారీగా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ వారంలో నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో నూజివీడు డివిజన్‌లోని మండలాల ప్రగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ విషయంలో రాష్ట్రంలో ఏలూరు జిల్లాను మూడో స్థానం నుండి రెండోస్థానానికి తీసుకురావడానికి మరింత కష్టపడి పని చేయాలని ఆదేశించారు. వచ్చేవారంలో 466 గృహాలను పూర్తిచేయాలని, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు డిఇలు, ఎఇలు క్షేత్రస్థాయిలో సందర్శించి లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి జి.సత్యనారాయణ, ఉప కార్య నిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో నాలుగు హాస్టల్ భవనాల నిర్మాణం

సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి జెడి ఎం.ముక్కంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిలాల్లో శిథిలావస్థలో ఉన్న నాలుగు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల స్థానంలో రూ.12 కోట్ల వ్యయంతో నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి జాయింట్ డైరెక్టర్ ఎం.ముక్కంటి చెప్పారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ముక్కంటి మాట్లాడుతూ జిల్లాలోని కైకలూరు, పెదపాడు, గుండుగొలను, ముదినేపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల స్థానంలో రూ.12 కోట్ల వ్యయంతో కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో మొత్తం 59 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని, వాటిలో 53 ప్రభుత్వ భవనాల్లో, ఆరు ప్రయివేటు భవనాల్లో నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 59 వసతి గృహాల్లో 27 బాలుర వసతి గృహాల్లో 1766 మంది విద్యార్థులు, 32 బాలికల వసతి గృహాల్లో 2694 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారన్నారు. వీరందరికీ 5130 దుప్పట్లు, కార్పెట్లు, టవల్స్, తదితర నిత్యం వినియోగించే వస్తువులు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాల్లో 52 భవనాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.72 కోట్లు మంజూరు చేసిందని, మరమ్మతు పనులను పంచాయతీరాజ్, రహదారులు, భవనాలు, సాంఘిక సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం, సర్వశిక్షా అభియాన్, పబ్లిక్ హెల్త్ శాఖలకు అప్పగించినట్లు వివరించారు. 90 శాతం మేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు పురోగతిలో ఉన్నాయని, వసతి గృహాల్లో ప్రవేశాల ప్రారంభానికి ముందే జూన్, మొదటి వారం నాటికి భవనాల మరమ్మతులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణపరంగా పలు చర్యలు తీసుకుంటున్నామని, 56 సంక్షేమ వసతి గృహాల్లో 448 సీసీ కెమెరాలు అమర్చామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6900 మంది విద్యార్థులను సంక్షేమ వసతి గృహాల్లో చేర్పించే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించామన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి విద్యకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, వసతి గృహాల్లో సౌకర్యాల గురించి తెలియజేస్తున్నామన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్య అభ్యసించే వారిలో పదో తరగతిలో 87 శాతం, ఇంటర్‌లో 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ముక్కంటి తెలిపారు.

ఆయుష్‌కు ప్రతిష్టాత్మక అక్రిడిటేషన్ సర్టిఫికెట్

ఆ ఆస్పత్రి ఛైర్మన్ యార్లగడ్డ రమేష్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సర్టిఫికెట్ చూపుతున్న ప్రముఖులు

వైద్య విభాగంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్ సర్టిఫికెట్‌ను ఆయుష్ హాస్పిటల్ దక్కించుకుందని ఛైర్మన్ యార్లగడ్డ రమేష్‌బాబు తెలిపారు. ఏలూరులోని ఆయుష్ హాస్పిటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ సర్టిఫికెట్‌ను రోగి సంరక్షణ, భద్రత, నాణ్యత మెరుగుదల, సౌకర్యాల నిర్వహణతో సహ విస్తృత శ్రేణి ప్రమాణాలు నూరుశాతం కల్గి ఉన్న వాటికి లభిస్తుందన్నారు. ఆసుపత్రుల నాణ్యత భద్రత కోసం నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా, దాదాపు 651 లక్ష్యాలు ఎన్ఎబిహెచ్ బృందం ద్వారా తనిఖీ చేయించి ధ్రువపత్రం వచ్చారన్నారు. ప్రధానంగా రోగికి మెరుగైన వైద్యం, సౌకర్యాలు కల్పించడం, రోగి హక్కుల గురించి అవగాహన కల్పించడం వంటివి పాటిస్తూ రోగి భద్రత ఏకైక లక్ష్యంగా ఆయుష్ ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వహణా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్డియాలజీ విభాగం అధినేత డాక్టర్ పిఎస్.శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ఏలూరులో ఆయుష్ ఆసుపత్రి ప్రారంభించిన మూడు సంవత్సరాల నుండి నాణ్యమైన, నమ్మకమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్యులు ఉన్నందుకు గర్వపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో నిర్వహించని అరుదైన శస్త్ర చికిత్సలు ఏలూరు ఆయుష్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఎబిహెచ్ అక్రిడిటేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ దశరధ్ బొప్పన మాట్లాడుతూ ఆయుష్ హాస్పిటల్ 2022లో ప్రారంభించినప్పటి నుంచి నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా నిర్వహిస్తున్నామని, 2023 నాటికి ఎన్ఎబిహెచ్ ఎంట్రీ లెవెల్ గుర్తింపు సాధించిందన్నారు. 2024 నాటికి క్యూసిఐ (క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) గుర్తింపు సాధించి, ఆనతి కాలంలోనే 2025 నాటికి తమ ఆస్పత్రి పూర్తిస్థాయిలో ఎన్ఎబిహెచ్ సాధించడంపై గర్వపడుతున్నామని తెలిపారు. సమావేశంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేడ జయలక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అక్కిన శ్రీరామ్, హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

చిచ్చు పెట్టేలా కేంద్ర ప్రభుత్వ చర్యలు

మతాల పేరులో విద్వేషాలు

రెచ్చగొట్టేందుకు యత్నం

సిపిఎం ఆధ్వర్యాన సమైక్యతా వారోత్సవాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటూ చెప్పిన మోడీ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకుండానే అమెరికా జోక్యంతో దాడులను ఆపివేసి దేశ ప్రజల గౌరవాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారని, కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య మతాల పేరుతో విద్వేషాలు పెంచడం కోసం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలందరూ సమైక్యంగా ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. సమైక్యత వారోత్సవాల్లో భాగంగా సిపిఎం ప్రజలకు కరపత్రాలు పంచుతూ చైతన్యవంతం చేస్తూ సమావేశాలు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో శనివారం ఆర్.లింగరాజు మాట్లాడుతూ భారతీయులందరూ ఉగ్రవాద దాడిని ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. కాశ్మీర్ ప్రజలు సైతం ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఇలా ఐక్యంగా ఉండడం మతోన్మాద బిజెపి శక్తులకు ఇష్టం లేకపోగా ఉగ్రవాద దాడులను రెండు మతాల మధ్య దాడులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదానికి మతం, మానవత్వం లేవని, అలాంటి



కరపత్రాలు పంచుతున్న సిపిఎం నేతలు

ఉగ్రవాదాన్ని సమైక్యంగానే ఎదుర్కొగలమని చెప్పారు. మతాల మధ్య విద్వేషాలతో ఎదుర్కొవడం సాధ్యం కాదన్నారు. బిజెపి శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో ఒక మతానికి వ్యతిరేకంగా విష ప్రచారం చేయడాన్ని ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. మతసామరస్యం దేశ సమైక్యత ద్వారానే ఉగ్రవాదాన్ని ఎదుర్కొగలమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ఆర్గనైజర్ కట్ట భాస్కరరావు, పార్టీ మండల నాయకులు మానుకొండ వీర్రాజు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో జాగిలాలది కీలక పాత్ర

ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఐజి అశోక్‌కుమార్

పోలీసు జాగిలాలు నేర పరిశోధన క్రమంలో ఎంతో ఉపయోగపడతాయని, అంతేకాకుండా వాటికి ప్రత్యేక లక్షణాలు వచ్చే విధంగా తీర్చిదిద్దే డాగ్ హ్యాండ్లర్స్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించాలని ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో పోలీసు జాగిలాలకు తర్ఫీదు ఇచ్చేందుకు కొంతకాలంగా ఒక భవనం ఉంది. అయితే కాలక్రమేణ భవనం శిథిలం కావడంతో దాని స్థానంలో నూతన భవనాన్ని ఎస్‌పి సారథ్యంలో పున:నిర్మించారు. ఈ నిర్మాణంలో డాగ్ హ్యాండ్లర్స్ ప్రత్యేక పాత్ర పోషించారు. అంతేకాకుండా కొత్తగా నిర్మించిన ఈ భవనానికి కెనైన్ అని నామకరణం చేశారు. ఈ భవనాన్ని ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజికి జిల్లాలో ఉన్న నాలుగు జాగిలాల్లో ఒక జాగిలమైన రాకీ పూలగుచ్ఛాన్ని ఇచ్చి ఆయనను ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో జాగిలాలు ఎన్నో ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయన్నారు. వాటికి ఈ లక్షణాలు అబ్బే విధంగా తర్ఫీదు ఇచ్చిన డాగ్ హ్యాండ్లర్స్ సుగుణరావు, ఎన్.రాజు, ఎన్.సీతారామాంజనేయులు, కె.రాఘవేంద్రరావులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జాగిలాలు ఎంతో తెలివిగా ప్రవర్తిస్తూ ఎక్స్‌ప్లోసివ్‌లను గుర్తించడంలో, ట్రాకింగ్‌లో విశిష్ట సేవలందిస్తాయని తెలిపారు. ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి శ్రమదానం చేసిన సుగుణరావు, రాజు, సీతారామాంజనేయులు, రాఘవేంద్రరావులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వాహనాలను రద్దు చేయొద్దు

కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు సిటీ :రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలను రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని, ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పి.కిషోర్, వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏలూరులో ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాల వారు (ఎండియులు) శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, పి.కిషోర్, వైసిపి నాయకులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయప్రకాష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎండియులు, వైసిపి నేతలు

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉంటే, కేరళ రాష్ట్రం వలె పేదలకు 16 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయొచ్చన్నారు. అంతేగాని గత ప్రభుత్వంలో నియమించారనే కక్ష సాధింపు చర్యలతో వారిని తొలగించాలను కోవడం సరికాదన్నారు. గత ప్రభుత్వం రేషన్ డీలర్లను కొనసాగిస్తూనే ఎండియు విధానాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. అదే విధంగా ఇప్పుడు రేషన్ డీలర్లతో పాటు ఎండియు విధానం కూడా అమలు చేయవచ్చని చెప్పారు. ప్రభుత్వం అకస్మాత్తుగా ఇంటింటి రేషన్ పంపిణీ విధానం రద్దు చేయడం వల్ల, 9260 మంది ఎండియులు మరో 9260 మంది హెల్పర్లు సుమారు 20 వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2027 వరకు రాష్ట్ర ప్రభుత్వంతో వీరికి అగ్రిమెంట్ ఉందని గుర్తు చేశారు. ఎండియులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఎఐటియుసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, ఎండియుల పాల్గొన్నారు.

మాటలు సరే.. చేతలేవీ..!

తాము రైతులకు అండదండగా ఉంటామని, తమది రైతు పక్షపాత ప్రభుత్వమని పాలకులు అధికారంలోకి రాగానే చెప్పుకోవడం సర్వసాధారణమైంది. మాటల్లో ముందుండే పాలకులు కీలక సమయంలో రైతుల పక్షంగా చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారనేది వరి రైతుల నుంచి ఆక్వా, పామాయిల్, తాజాగా కోకో రైతుల వరకూ అందరి విషయంలోనూ స్పష్టమవుతోంది. ఏలూరు కలెక్టరేట్ వేదికగా మంత్రులు కోకో ధరపై చర్చలకు పిలిచినా కనీసం కంపెనీ ప్రతినిధులు సైతం హాజరు కాకపోవడం వారి ఇష్టారాజ్యం, దోపిడీ విధానాన్ని ప్రతిబింబిస్తుందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ప్రకారం ఇక్కడ కోకో ధర నిర్ణయించి అమలు చేయాలని రైతుల ఆందోళన నేపథ్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి ఇటు రైతులు, ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. అసలు కంపెనీల ప్రతినిధులే చర్చలకు ముఖం చాటేయగా, హాజరైన ట్రేడర్లు తమ చేతుల్లో ఏమీ లేదని, కంపెనీలు ఇచ్చే ధర ప్రకారమే కొనుగోలు చేస్తామని చెప్పడంతో మంత్రులు సైతం అవాక్కయ్యారు. ఇక గత్యంతరం లేక కంపెనీల ప్రతినిధులను ఆన్‌లైన్‌లోకి పిలిచి మాట్లాడారు. అయితే కంపెనీ ప్రతినిధులు తాము ఎందుకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వడం లేదనే దానికి సమాధానం చెప్పకుండా, తాము ఎట్టి పరిస్థితుల్లోనూ కిలో కోకో గింజలు రూ.450కు మించి కొనుగోలు చేయలేమని స్పష్టం చేశారు. దీంతో మంత్రులే బతిమలాడి తాము రూ.50 చొప్పున ఇస్తామని, అందువల్ల రైతుల వద్ద కిలో ధర రూ.500కు కొనుగోలు చేయాలని చెప్పి చర్చలు ముగించేశారు. కానీ వాస్తవంగా అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర రూ.800కుపైనే ఉంది. కనీసంగా రూ.700 వరకైనా ధర వస్తేగాని రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. మరి మంత్రులు సైతం రూ.500 ధర ఎలా నిర్ణయించారో వారికే తెలియాలి. కనీసం అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం ఇక్కడ ధర ఎందుకు చెల్లించడం లేదనే దానికి ఎవరి నుంచీ సమాధానం రాని పరిస్థితి. దీంతో కోకో రైతుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందంగా తయారైంది. ఇదే తరహాలో వరి రైతులు ధాన్యం అమ్మకం సమయంలో మిల్లర్లకు సొమ్ము చెల్లించడంగాని, లేదా అదనంగా ధాన్యం తూయాల్సిన పరిస్థితులు ఎదురైన సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఆక్వా రైతులు సైతం ఫీడ్, సీడ్ ధరలు పెరగడం, నాణ్యతా ప్రమాణాలు లోపంతో పాటు ధర రాక తీవ్ర నష్టాలు పాలవుతున్నామని ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై సీడ్, ఫీడ్ ధరలు తగ్గించేటట్లు చర్యలు తీసుకుంటామని హడావుడి చేసిన పాలకులు, అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోయారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలో ఆక్వా రైతులు పాలకొల్లు ప్రాంతంలో క్రాప్ హాలిడేకు సిద్ధమయ్యారు. జులై నుంచి సాగుకు విరామం ప్రకటించాలని నాలుగు మండలాల రైతులు సన్నద్ధమవుతున్నారు. అంటే జిల్లాలోని వివిధ పంటల రైతులు ఆందోళన బాట పడుతున్నారనేది స్పష్టమవుతోంది. ఈ ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం రైతుల పక్షపాతిగా చర్యలు చేపడుతుందా, లేక తూతూమంత్రపు చర్యలతో రైతు వ్యతిరేక ప్రభుత్వంగా నిలుస్తుందా అనేది వేచిచూడాలి.

- వియస్ఎస్‌వి.ప్రసాద్

10వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



దీక్షల్లో పాల్గొన్న నేతలు

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరుతూ ఆదివాసీ జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం తహశీల్దార్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో పదో రోజుకు చేరుకున్నాయి. పదో రోజు దీక్షలను ఎటిఎ జిల్లా గౌరవ సలహాదారు సోదెం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ 3ని రద్దు చేయడం వల్ల ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ జిఒలు, చట్టాలు చేయాలని కోరారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజనల్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా డిఎస్‌సిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో పాల్గొన్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షులు రవ్వ బసవరాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యదర్శి పొడియం కొవ్వాడయ్య, బుట్టాయగూడెం సర్పంచి తెల్లం వెంకాయమ్మ, కెఆర్.పురం సర్పంచి బొజ్జి, మంగయ్యపాలెం సర్పంచి మాల్చి వెంకన్నబాబు, కుంజా రమేష్, మల్లం చిన్న పెంటయ్య, మడకం చలపతిరావు, ప్రతాపరెడ్డి, మోసం కన్నప్పరాజు, తెల్లం శ్రీను, పూసం శ్రీను, కుంజా ముత్యాలరావు, తెల్లం భీమరాజు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న ఐజి

ఎస్‌పి కార్యాలయంలో ఐజి తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశామని ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్‌కుమార్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన శనివారం తనిఖీ చేశారు. తొలుత ఆయనకు ఎఆర్ విభాగ సిబ్బంది గౌరవ వందనాన్ని సమర్పించారు. ఆయన పలు రకాలైన విభాగాలను తనిఖీ చేశారు. నేరాల పరిశోధన, కేసుల దర్యాప్తు వంటి విషయాల గురించి ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ల పనితీరును సమీక్షించారు. హోంగార్డు విభాగంలో ఉన్న సమస్యలు, ప్రస్తుతం వారి సంక్షేమానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలు సంతృప్తికరంగానే ముగిశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరరావు, పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి సెంటర్‌లో వెలిగిన వీధి దీపాలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కొత్తపల్లి సెంటర్‌లో వీధి దీపాలు వెలిగాయి. మండలంలోని వణుదుర్రు పంచాయతీ శివారు కొత్తపల్లి సెంటర్‌లో వీధి దీపాల పాడై నెలలు గడుస్తున్నా పంచాయతీ ఏర్పాటు చేయకపోవడంపై ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం అంధకారంలో కొత్తపల్లి సెంటర్ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన ఇఒపిఆర్‌డి అశోక్ ఆదేశాలతో ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి పంతగాని మనోజ్ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ సిబ్బంది పాడైన వీధి దీపాలు తొలగించి కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కొత్తపల్లి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఉన్న బజార్, ఎస్‌సి ఏరియా, ఆర్‌సిఎం చర్చి వద్ద, వణుదుర్రు, వాడవల్లి వెళ్లే రోడ్లల్లో పాడైన 35 వీధి దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా విద్యార్థులచే స్టోరీ చదివించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎం.శ్రీదేవి, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు కథలు, కథనాలు, సృజనాత్మకత కృత్యాలతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు.

అవగాహనా ర్యాలీ

మానసిక రుగ్మతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో మానసిక రగ్మతపై శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, మానసిక వైద్య నిపుణులు కె.హన్నాకోమలి మాట్లాడుతూ తొలి దశలోనే సరైన రీతిలో వైద్య సేవలందించేందుకు ఆసుపత్రులకు తరలిస్తే 99 శాతం ఈ మానసిక రుగ్మత నుంచి బయటపడేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. జనాభాలో ఒక శాతం ప్రజలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు అనేక సర్వేల ద్వారా వెల్లడైందన్నారు. ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలందించే విభాగం ఉన్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పట్టపగలే చోరీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన సాధు చెన్నారావు జీడి గింజలు, పత్తి వ్యాపారం చేస్తూ ఉంటాడు. వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లగా భార్య సెంటర్‌లో ఉన్న షాపునకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గుర్తు తెలీని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా పగలకొట్టి చోరీకి పాల్పడ్డట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న వెండి, కొంత నగదు మాయమైనట్లు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌లను రప్పించి ఇంటి పరిసరాలను పరిశీలించారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కుక్కునూరు

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఎస్‌ఐ తన సిబ్బందితో మండలంలోని పాములేరు బ్రిడ్జి వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వేలేరు గ్రామానికి చెందిన వాంతోసు సాయికిరణ్ బైక్‌పై నాటుసారాను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అతడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వేలేరు గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి సారా సరఫరా చేయమని చెప్పినట్లు పోలీసులు గుర్తించారు. సాయికిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని, సురేష్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లక్కవరంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం సాయంత్రం ఎస్‌ఐ డి.శశాంక తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,380 నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కార్పొరేట్‌కు దీటుగా 'భారతి విద్యానికేతన్'లో విద్యాబోధన

హైస్కూల్ ప్రిన్సిపల్ కొండేటి శౌరీమాస్టర్, కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి

ప్రజాశక్తి - ముసునూరు


ప్రిన్సిపల్ శౌరీమాస్టర్

కరస్పాండెంట్ విజయలక్ష్మి

గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యను అందించడమే భారతి విద్యానికేతన్ హైస్కూల్ లక్ష్యమని ప్రిన్సిపల్ కొండేటి శౌరీమాస్టర్, కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. సరికొత్త ఆలోచనలతో, నిత్య నూతనమైన ప్రతిష్ట విద్యా విధానంతో భారతి విద్యా నికేతన్ హైస్కూల్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ స్టడీ అవర్స్ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. చదివిన సబ్జెక్టుల నుంచి బెస్ట్ మెటీరియల్, విద్యాబోధన అందించడంతో నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నామన్నారు. క్వాలిఫైడ్, అనుభవం గల ఉపాధ్యాయులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన ఉంటుందన్నారు. ఇంగ్లీషు, లెక్కలు, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. నూతన పరిజ్ఞానం అందరికీ అందేలా కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సైన్స్ పరికరాలపై పరిజ్ఞానం పెంపొందించుకునేలా కృషి చేస్తునామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు యాక్టివిటీ బెస్ట్ ఎడ్యుకేషన్ మెటీరియల్‌తో పాటు విద్యాబోధన అందిస్తున్నామన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీరేశలింగం పంతులు, ఉపాధ్యాయ దినోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో వ్యాసరచన, క్విజ్, ఉపన్యాసం, చిత్రలేఖన, చేతిరాత, డ్యాన్స్, క్రీడల పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభ గలవారికి ప్రత్యేక బహుమతులు అందిస్తున్నామన్నారు. నవోదయం, గురుకుల బాలికల పాఠశాలలకు ప్రతి ఏడాది ఎందరో విద్యార్థులు తమ పాఠశాల నుంచి ఎంపికవుతున్నారన్నారు. అన్ని ప్రాంతాల వారికి బస్సు సౌకర్యం ఉందన్నారు. సాయంత్రం వేళ ప్రతిరోజూ రీడింగ్ క్లాసులు నిర్వహించే సమయంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, లెక్కలు, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. లేబరేటరీ సౌకర్యం ఉందన్నారు. అన్ని తరగతుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థుల తల్లిదండ్రులకు పేరెంట్స్ కమిటీ మీటింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యత సంపాదించాలనే ఉద్దేశంతో ఆట పాటలతో పాటు పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా చైతన్య పరుస్తున్నామన్నారు. పలు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తునామన్నారు. వరద బాధితులకు విద్యార్థులు సాయం అందించారని తెలిపారు. అంకితభావంతో సేవా కార్యక్రమాలు నిర్వహించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. చదువుతో పాటు మంచి పరిజ్ఞానం, అనుభవం అన్ని నేర్చుకోవాలంటే భారతి విద్యానికేతన్ బహుముఖ పాఠశాల అని చెప్పారు.


భారతి విద్యానికేతన్ హైస్కూల్ భవనం

మాంసం దుకాణాలు తొలగించాలి

తహశీల్దార్‌కు దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన వినతి

గిరిజన చట్టం ఉల్లంఘన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న చికెన్ షాపులు తొలగించాలని కోరుతూ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ చలపతిరావుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పంచాయతీ షాపుల్లో చికెన్ దుకాణాలను నిర్వహిస్తున్నారన్నారు. గిరిజన చట్టం ప్రకారం ఈ షాపులను గిరిజనులు మాత్రమే నిర్వహించాలని, కాని గిరిజనుల పేరుతో గిరిజనేతరులు బినామీదారులుగా నిర్వహిస్తున్నారన్నారు. నిర్వహణ కార్యక్రమం అంతా పంచాయతీ అధికారులకు తెలిసే జరుగుతుందన్నారు. ఈ చికెన్ షాపులోని వ్యర్థాలన్నింటినీ కూడా డ్రెయినేజీలో కలపడం వల్ల అక్కడి నుంచి డ్రెయినేజీ ద్వారా దళితపేట రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో వ్యర్థ పదార్థాలతో కూడిన నీరు పెద్ద మురికి కూపంగా తయారై చెడు వాసన వస్తూ తీవ్రమైన ఇబ్బంది కలిగిస్తుందన్నారు. ఈ మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అధికంగా పెరిగిపోయి దుర్వాసన, వాంతులు, విరేచనాలు రావడంతో రాజీవ్ నగర్ కాలనీ వాసులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెండు నెలల క్రితం స్థానిక ఎంపిడిఒకు వినతిపత్రం ఇచ్చినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, నిత్యం తహశీల్దార్ కార్యాలయానికి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తూ ఉంటారని, ప్రజలు కార్యాలయం ఎదుట కూర్చుంటే షాపు నుంచి వచ్చే దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చికెన్ షాపులను తొలగించకపోతే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చలపతిరావు మాట్లాడుతూ సోమవారం సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ మెంబర్ డి.శిఖమణి, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎ.ఏసుపాదం పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

బాల బాలికలందరూ గుర్తింపు కార్డు కలిగి ఉండాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి బుల్లికృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు బాల బాలికలందరూ గుర్తింపు కార్డును కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లికృష్ణ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సామాజికంగా వెనుకబడిన, అనాథ బాలలకు ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, న్యాయ సాధికారిత అంశంపై సంబంధిత అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లికృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనాథ, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన, గుర్తింపు కార్డు లేని బాలలను గుర్తించి వారికి గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డును ఇప్పించాలని సూచించారు. ఈ ప్రక్రియకు న్యాయ, రెవెన్యూ, వైద్య శాఖలు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లతో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో సర్వే నిర్వహించి ఆధార్ కార్డు లేని బాలలను గుర్తించి, వారికి ఆధార్ కార్డుల నమోదు ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రక్రియ నాలుగు దశలుగా ఉంటుందన్నారు. కమిటీ ఏర్పాటు చేయడం, ఆధార్ కార్డు లేని అనాథ బాలలను గుర్తించడం, రిజిస్ట్రేషన్ చేయడం, గుర్తింపు కార్డులను జారీ చేయడం ప్రక్రియలు ఉంటాయని చెప్పారు. సంబంధిత అధికారులు న్యాయ సేవాధికార సంస్థ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియలో భాగం కావాలని సూచించారు. ఈనెల 25వ తేదీ జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ప్రస్తుత సమాజంలో బాలల అక్రమ రవాణా పెరిగిపోయిందని, ఆయా శాఖల దృష్టికి వచ్చిన ఫిర్యాదు విషయాల్లో అలసత్వం వహించరాదని, అవసరమైన పక్షంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయపరమైన సలహాలను అందిస్తుందని సూచించారు. న్యాయశాఖ, ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేసి ఈ సమస్యను అధిగమించవచ్చని, పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారు, సిడబ్ల్యుసి వారు ఈ బాలల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా న్యాయశాఖాధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి శారద, ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్యచక్రవేణి, పశ్చిమగోదావరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేష్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, పోలీస్ అధికారులు, సిడబ్ల్యుసి సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుల్లికృష్ణ

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

సోమవరం గ్రామంలో ఎస్‌ఐ పల్లెనిద్ర

ప్రజాశక్తి - చాట్రాయి

శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని చాట్రాయి ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ ఆదేశాల మేరకు నూజివీడు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ నేతృత్వంలో మండలంలోని సోమవరం గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు భద్రతతో జీవించేందుకు అవసరమైన వివిధ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను వివరించారు. 112కు డయల్ చేస్తే అత్యవసర పోలీసు, అంబులెన్స్ , అగ్నిమాపక సేవల కోసమని, 1972కు డయల్ చేస్తే మత్తుపదార్థాల నివారణకు, 1930 సైబర్ నేరాల నివారణ కోసమని చెప్పారు. ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరలించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ, ట్రాఫిక్ నియమాల పాటింపు వంటి విషయాల్లో ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. వర్షాకాలంలో రైతులు మోటార్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని, రక్షణకు మట్టి తొడుగులు, ఇన్సులేటెడ్ టూల్స్ వాడాలని సూచించారు. సెలవుల్లో పిల్లలు చెరువులు, గుంటలవద్ద ఈతలకు వెళ్లకుండా తల్లిదండ్రులు నిఘా పెట్టాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, విక్రయానికి పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారికి వ్యతిరేకంగా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో, పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్ 112, మీకు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో చాట్రాయి పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

డస్ట్‌బిన్‌ల వితరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ దేవిశెట్టి దినేష్‌బాబు సౌజన్యంతో స్వచ్ఛంద్రా కార్యక్రమంలో భాగంగా నూజివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లో పరిశుభ్రత కోసం 12 డస్ట్ బిన్లను వితరణగా అందించారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఆర్‌టిసి టూర్ ప్యాకేజీ కరపత్రాలు, ఆర్‌టిసి బ్యానర్లు, డస్ట్ బిన్‌లు ఇలా అనేక రకాలుగా నూజివీడు బస్టాండుకు వితరణకు సహకరించిన డాక్టర్ దినేష్‌బాబుకు డిపో మేనేజర్ పవన్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మానవత డైరెక్టర్ ఒగిరాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ప్రయాణికులు డస్ట్ బిన్‌లను ఉపయోగించుకుని నూజివీడు బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కొప్పోలు రంగారావు, కోలేటి తిరుపతిరావు, గుడివాడ మురళీమోహన్, యార్లగడ్డ రాధాకుమారి, సత్యనారాయణ, నడికట్ల వెంకటేశ్వరరావు, గొల్లపల్లి రంగారావు, వడ్డీ బాజీ, ఆర్‌టిసి సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

బైక్ ఫైనాన్స్ యజమానులకు సిఐ సూచన

ప్రజాశక్తి - చింతలపూడి

ఫైనాన్స్ ఓనర్స్ తప్పనిసరిగా క్వాలిటీ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సిఐ రాజశేఖర్ సూచించారు. చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బైక్ ఫైనాన్స్ షోరూమ్స్‌ను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనం చేసిన బైక్స్ ఎవరైనా తీసుకొస్తే తప్పనిసరిగా స్థానిక పోలీస్ వారికి తెలియజేయాలని చెప్పారు. బైక్ ఫైనాన్స్ వారు తప్పనిసరిగా ఇన్ వార్డ్, అవుట్ వార్డ్ రిజిస్టార్ మెయింటైన్ చేయాలని తెలిపారు. ఎంట్రీ, ఎగ్జిట్ ఏరియాల్లో తప్పనిసరిగా కెమెరాలు అమర్చుకోవాలన్నారు. వాహనాలు కొనుగోలు చేసినా, విక్రయించినా ప్రోపర్ డాక్యుమెంట్ మెయింటైన్ చేయాలని తెలిపారు. కొనుగోలుదారులకు, అమ్మకందారులకు కెవైసి తప్పనిసరిగా చేయించాలని తెలిపారు.

ప్రజారోగ్యంతో చెలగాటం..!

మాంసం నాణ్యతపై ముద్రలకు స్వస్తి

పత్తా లేని కమిటీ పర్యటన

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

"ఆశీళ్ల కట్టించుకున్నాం... అంతా తన్నుకు చావండి..." అనే రీతిగా మున్సిపల్ అధికారుల వ్యవహార శైలి ఉందంటూ పలువురు సామాజికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే ఎక్కువ శాతం ప్రజలు మాంసం వైపు పరుగులు తీస్తారు. ఈ మాంసం కటింగ్, విక్రయాల్లో అధికారుల పరిశీలన, పర్యవేక్షణ, నిర్ధారణ కొనసాగాలి. లేకుంటే ప్రజారోగ్యం అధోగతి పాలవుతుంది. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, పశుసంవర్ధక శాఖ వైద్యులు, ఇతర సిబ్బందితో కమిటీగా ఏర్పడి మాంసం కటింగ్ నుంచి సరఫరా వరకు ప్రతి దశలో కమిటీ సభ్యుల పర్యవేక్షణ, పరిశీలన కొనసాగాలి. నాణ్యత నిర్ధారణకు సంబంధించి అధికారిక చిహ్నమైన ముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ విధంగా పట్టణ ప్రాంతాల్లో కమిటీ నిర్ధారించిన ముద్ర కలిగిన మాంసం మాత్రమే దుకాణదారులు విక్రయించాలి. ఈ నిబంధనలు అతిక్రమించినవారిపై కఠినమైన చర్యలు కూడా కమిటీ వారు తీసుకుంటారు. ఇదే కొనసాగితే మాంసప్రియుల ఆరోగ్యానికి పూర్తిస్థాయి రక్షణ ఏర్పడుతుంది. నూజివీడు పట్టణ పరిధిలో మాత్రం మున్సిపల్ అధికారులకు ఈ నిబంధనలు ఏ మాత్రం పట్టడం లేదు. కేవలం ఆశీళ్ల వసూలు చేసుకుంటున్నాం... ఆదాయాన్ని చూపిస్తున్నాం... ఇక ఇంతటితో సరి అని చేతులు దులుపుకుంటున్న మున్సిపల్ అధికారుల తీరుతో పలు ప్రజాసంఘాల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డబ్బు వసూళ్లపై అధికారులకు ఉన్న శ్రద్ధ, ప్రజారోగ్యం పట్ల లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాంసం కటింగ్‌లో, సరఫరాలో ఏమాత్రం కల్తీ జరిగినా ప్రజారోగ్యం రక్షణకు ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం సంభవించక ముందే గుర్తించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం దారుణమని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాంసం కటింగ్, సరఫరాలు, క్రయ విక్రయాల పట్ల సునిశితమైన పరిశీలన కొనసాగించి నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించే ముద్రలు కచ్చితంగా వేయాలని మాంసప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

21 వరకు యోగాంధ్ర

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా వ్యాప్తంగా జూన్ 21 వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాలకు సంబంధించి కార్యాచరణ ఉత్తర్వులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి జారీచేశారు. సమిష్టి భాగస్వామ్యంతో జిల్లాను యోగాంధ్రలో ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. జిల్లాలో దాదాపు పది లక్షల మందికి యోగాను నేర్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు ఏలూరు నగరపాలక మున్సిపల్ కమిషనరును నోడల్ అధికారిగా నియమించారన్నారు. ఈ నెల 27వ తేదీన ఐదు వేల మందితో యోగా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఏలూరు మున్సిపల్ కమిషనర్, డిఆర్‌డిఎ పీడీ, డిసిఇ, ఎల్‌డిఎం, ఆయూష్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అందుకు తగిన యోగా శిక్షకులను, వేదిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

26న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 26వ తేదీన ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ ఫీర్ అహమ్మద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన 33/11 కెవి మక్కినవారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్‌ఎస్ పనులు, కొత్త లైన్ల ఏర్పాటు పనుల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేషన్ డీలర్ల హర్షం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ డీలర్ల ద్వారానే కార్డు దారులకు డిపో వద్దనే సరుకుల పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ వారి ఫొటోలకు జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వారు శనివారం పాలాభిషేకం చేశారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వారు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ రాజులపాటి గంగాధర్ మాట్లాడుతూ ఎన్నికల్లో రేషన్ డీలర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత నాలుగేళ్లలో కనీసం అద్దె కట్టుకోవడానికి కూడా కష్టంగా ఉండేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల్లో పెరుగుతున్న దొంగతనాలు, గొడవల దృష్ట్యా నిఘా కోసం పోలీసులకు రూ.60 వేల విలువైన సీసీ కెమెరాల సామగ్రిని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చేతులమీదుగా శనివారం అందించారు. రమణక్కపేట గ్రామానికి చెందిన దాత చట్టుమోలు యోసేబు తన సొంత ఖర్చులతో సీసీ కెమెరాల సామగ్రి పోలీసులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు రంగు శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబు పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెంలో వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వంగవీటి రంగా అన్ని తరగతుల వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పి.రాము, జి.రవికుమార్, ఉమా, సాయి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోకో గింజలకు అంతర్జాతీయ ధర చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించకుండా కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కంపెనీలు, ట్రేడర్లు కోకో గింజలు కొనుగోలు చేశారని, అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధర చెల్లించకుండా తక్కువ ధరకు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కోకో రైతుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తామని తెలిపారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం, జువ్వలపాలెం కాపురస్తులు బాలం నాగేశ్వరరావు గారి కుమారుడు బాలం నాగరాజు అను నేను ది. 19-05-2025వ తేదీన జువ్వలపాలెం నుండి బ్యాంక్ పని నిమిత్తం తణుకు వెళ్ళుచుండగా దువ్వ తేతలి మధ్యలో నా ఒరిజినల్, లింక్ దస్తావేజులు, **D.No. 3974/2007** మరియు **D.No. 5816/2011** తాడేపల్లిగూడెం SRO లో రిజిష్టర్ కాబడినవి. పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యడల నా నెంబరుకు గాని నా క్లయింటు నెంబరుకు **83096 90092** తెలియపరచిన తగిన పారితోషకము యివ్వబడును.

తోట వెంకట సత్యనారాయణ
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం
సెల్: 99482 43686

తాడేపల్లిగూడెం
24-05-2025